ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA
VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 285 గురువారం 10-10-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు జీలు : 4 వెల : 5 రూ/..

# సమాజానికి సమర్థులైన పౌరులను అందించండి

## వారిని తీర్చి దిద్దే బాధ్యత టీచర్లుగా మీపైనే ఉంది

### డీఎస్సీ నియాక పత్రాల అందచేతలో సిఎం రేవంత్



**హైదరాబాద్,అక్టోబర్ 9:** సమర్థులైన పౌరులను తీర్చిదిద్దే బాధ్యత కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న టీచర్లపైనే ఉందని, పాఠశాలలు అందుకు వేదిక కావాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మీకు వచ్చిన ఈ బాధ్యతను సమర్థంగా ఉపయోగించి సమాజానికి మంచి పౌరులను అందించాలన్నారు. కెసిఆర్ ఇంట్లో ఉద్యోగాలు ఊడగొట్టడం వల్లనే ఇవాళ తెలంగాణలో కొలువుల జాతర సాగుతోందన్నారు. డీఎస్సీ విజేతలను చూస్తే దసరా పండుగ ముందే వచ్చినట్లు అనిపిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టీచర్లే తెలంగాణ వారధులు.. నిర్మాతలని, పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందని తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలను సిఎం రేవంత్ స్వయంగా అందజేసారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ కొత్త టీచర్లకు కీలక సూచనలు చేశారు. తెలంగాణలో 30వేల పాఠశాలలు ఉంటే.. 24లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు యాజమాన్యంలో 10 వేల పాఠశాలలు ఉంటే 34లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటులో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ బడికి వెళ్లడమంటేనే గ్రామాల్లో సైతం నామోషీగా భావిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి పోయిన వారు కూడా తాము తిన్నా తినకపోయినా, పుస్తెలు అమ్మి అయినా తమ పిల్లలను ప్రైవేటు బడి, కాన్వెంట్‌కు పంపాలనుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలకు పంపాలంటే.. ఎందుకు ఇబ్బందిపడుతున్నారో ఆలోచించండి. మీకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటా.. కానీ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మీరు కృషిచేయండని సూచించారు. నిరుపేదలు బంగారం అమ్మి ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలన్నారు. తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారిని భవిష్యత్తులో డాక్టర్లుగా, లాయర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీదే. నేను ప్రభుత్వ బడిలో చదువుకున్నా.. సీఎం అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేశవరావు, కోదండరాం వంటి ఎందరో ప్రభుత్వ బడిలోనే చదివారు. కార్పొరేట్ బడిలో చదువుకోలేదు. మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం ప్రభుత్వ బడి. స్కూళ్లలో అన్ని వసతులూ కల్పించేందుకు కృషిచేస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ నెల 11న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శ్రీకారం చుడుతున్నాం. విద్యకు బ్జడెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాం. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరిస్తున్నాం అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. రెండుసార్లు కోరి కొఱవి దెయ్యాన్ని తెచ్చుకున్నట్లుగా బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చాం. ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ అవుతాయని అందరూ ఆశించినా.. తెలంగాణ వచ్చిన మూడేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్లకు నియామక ప్రక్రియ పూర్తి చేశారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు తీర్చలేదు. యువతకు ఉద్యోగాలు రావాలంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఉద్యోగాలు ఊడాలని గతంలో చెప్పాను. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని నిరుద్యోగులు బాధ్యత తీసుకున్నారు. 90 రోజుల్లో 30వేల కొలువులు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశాం. 65 రోజుల్లో డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశాం అని వివరించారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వ బడుల పాత్ర కీలకం. డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవాలని కొరివి దెయ్యాలు యత్నించాయి. కేసులు వేసి డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవడానికి కుట్రలు చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భవిష్యత్తు తరాలకు టీచర్లు ఆదర్శంగా మారబోతున్నారు. డీఎస్సీ విజేతల సంతోషాన్ని చూసి కొందరు కళ్లల్లో కారం పెట్టుకొంటారు. ఎంపీగా కవిత ఓడిపోగానే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కుమార్తెకు మాత్రం 6 నెలల్లో ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల మేలు కోసం విశ్రాంతి తీసుకోకుండా శ్రమిస్తున్నాం. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలి. తెలంగాణ సమాజంపై బీఆర్ఎస్‌కు ఎందుకంత కోపం? ఏడు లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు పోయాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. మా ప్రభుత్వాన్ని పడగొడతామని బీఆర్ఎస్ అంటోంది.. ఇది న్యాయమా? బీఆర్ఎస్‌కు అధికారం రాదు.. తెలంగాణ ప్రజలు ఇవ్వరని మరోమారు స్పష్టం చేశారు. విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలను పెంపొందిస్తాం. రాష్ట్రంలో ఏటా 1.10లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నారు. నైపుణ్యాలు పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ప్రారంభించాం. స్కిల్ వర్సిటీ ద్వారా సాంకేతిక నైపుణ్యం అందిస్తున్నాం. ఒలింపిక్స్ వేదికల్లో దేశం పరిస్థితి ఏంటో చూశాం. నాలుగు కోట్లు జనాభా ఉన్న దక్షిణ కొరియాకు ఒలింపిక్స్‌లో 32 పతకాలు వస్తే.. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఆ తరహాలో ఒలింపిక్స్‌లో ఎందుకు పతకాలు రాలేదు? తెలంగాణ యువత మత్తుకు బానిసలయ్యారు. వ్యసనాలకు బానిసలై.. యువత తప్పుదోవ పడుతున్నారు. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అ÷-లథెట్లకు బంగారు పతకాలు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, సిఎస్ శాంతికుమారి, ఆచార్య కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

# మా తొలి ప్రాధాన్యం కాశ్మీర్‌కు రాష్ట్ర హోదానే

### అధికారం చేపట్టగానే దీనిపైనే తీర్మానిస్తాం

### కాబోయే సిఎం ఒమర్ అబ్దుల్లా ప్రకటన



**శ్రీనగర్,అక్టోబర్9:** జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ గెలుపు అనంతరం సీఎంగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు చేపడతారని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలనే తీర్మానాన్ని ప్రధానికి సమర్పిస్తామన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, ఎన్నికలు, రాష్ట్ర హోదా వరుసగా ఉంటాయన్నారు. కొందరు నేతలు జమ్మూకశ్మీర్‌ను దిల్లీతో పోల్చడంపై ఆయన మండిపడ్డారు. కశ్మీర్‌ను దిల్లీతో పోల్చవద్దని..ఎందుకంటే దేశ రాజధానికి రాష్ట్ర హోదా ఇస్తామని ఎవరూ చెప్పలేదన్నారు. కానీ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రధాని, హోంమంత్రి, భాజపా సీనియర్ మంత్రులు చెప్పారని పేర్కొన్నారు. 2019 వరకు జమ్మూకశ్మీర్ రాష్ట్రంగానే ఉందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కశ్మీర్‌లో శాంతిని నెలకొల్పడం, అభివృద్ధికి బాటలు వేయడం కోసం రాష్ట్ర హోదా తప్పనిసరి అని పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉన్న రాజకీయ పార్టీలను భాజపా లక్ష్యంగా చేసుకొని.. బలహీనపరచడానికి ప్రయత్నించిందని దుయ్యబట్టారు. కానీ ఆ పార్టీ ఎత్తులు ఫలించలేదన్నారు. ముఖ్యమంత్రిగా తన పేరును తన తండ్రి ప్రకటించడంపై ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ.. నేషనల్ కాన్ఫరెన్స్ శాసనసభా పక్ష సమావేశం అనంతరం మిత్రపక్షాలతో చర్చలు జరిపి ఈవిషయంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో 2019లో ప్రత్యేక ప్రతిపత్తి హోదాను కోల్పోయింది. దీంతోపాటు ఆ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారిపోయింది. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలన్నది ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ డిమాండ్ చేస్తోంది. ఒమర్ అబ్దుల్లా కూడా గత అయిదేళ్లుగా అందుకోసమే తీవ్రంగా శ్రమిస్తున్నారు. కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్నంతవరకూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో అడుగుపెట్టబోనని అన్న ఒమర్.. యూటర్న్ తీసుకొని, అసెంబ్లీ ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే వరకు తన ప్రయత్నాన్ని విరమించుకోనని పట్టుదలతో ఉన్నారు.

## మండలి చీఫ్‌విప్‌గా పట్నం బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్,అక్టోబర్ 9:** రాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్ గా డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. అసెంబ్లీ సెక్రటరీ నరసింహచార్యులు సమక్షంలో బాధ్యతలను స్వీకరించారు.అనంతరం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలవగా, ఆయన మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్ ,ఈర్లపల్లి శంకర్, మల్ రెడ్డి రంగారెడ్డి, మ్మెల్సీలు కోదండరాం, బల్మూరి వెంకట్, ఎగ్గే మల్లేష్, భాను ప్రకాష్, ప్రభాకర్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి,హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు చెందిన నాయకులు వజ్రేష్ యాదవ్ , చరణ్ కౌశిక్ యాదవ్ , పరమేశ్వర్ రెడ్డి రామ్మోహన్ గౌడ్, మహేందర్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బతుకమ్మ, దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు
మహబూబాబాద్ జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధుకుల, నాయకులకు
డాక్టర్లకు, అధికారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
బతుకమ్మ, దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు
డా|| బి. గోపాల్, M.S. (Ortho)
వెన్నుముక & జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ ఎముకల, కీళ్ళు మరియు
వెన్నుపూస ప్రత్యేక చికిత్సా నిపుణులు అన్నిరకముల ఫ్రాక్చర్ సర్జరీలు చేయబడును.
ఆరోగ్యశ్రీ, & EHS ద్వారా ఉచితంగా ఎముకలు విరిగిన వారికి ఆపరేషన్ చేయబడును
(మరియు కిడ్నీ ఆపరేషన్స్ కూడా చేయబడును
మా హాస్పిటల్ నందు ఇప్పటి వరకు అయిన సర్జరీలు
ఫిజియో థెరపీ సౌకర్యం కలదు.
సిద్ధార్థ హాస్పిటల్
బంధం చెరువు రోడ్, రెడ్డి బజార్,
మహబూబాబాద్.
సెల్: 6301034886

# చిట్యాలలో ఘనంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్
# (ఆర్ఎస్ఎస్) ఖండ పద సంచలన్ (రూట్ మార్చ్)

**తొలి సమయం భూపాలపల్లి అక్టోబర్ 9 :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ చిట్యాల మండల శాఖ ఆధ్వర్యంలో పద సంచలన్ మరియు విజయదశమి ఉత్సవము నిర్వహించడం జరిగింది. ఇందులో గనవేషధారనలో స్వయం సేవకులు 125 మంది పాల్గొని చిట్యాలలోని ప్రధాన వీధులలో దేశభక్తి గీతాలు పాడుకుంటూ..రూట్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది, తదనంతరం హైస్కూల్ గ్రౌండ్ లో విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించడం జరిగింది, దీనిలో భాగంగా ఖడ్గ పూజ మరియు ఆర్ఎస్ఎస్ శస్త్ర అయినటువంటి దండను పూజించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంగ్ చాలక్ చిలుకమారి సంజీవ్ పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ అనేది సరిగా 100 సంవత్సరాల క్రితం విజయదశమి పర్వదినం నాడు మహారాష్ట్రలోని నాగపూర్ లో డాక్టర్ కేశవరావు ప్రారంభించడం జరిగిందని, ప్రస్తుతం మన దేశంలో 65 వేల గ్రామాలలో సంఘ శాఖలు నడుస్తున్నాయని, ప్రపంచంలోని 60 దేశాలలో ఆర్ఎస్ఎస్ శాఖలు నడుస్తున్నాయన్నారు. ప్రతిరోజు ఒక గంట శాఖ ద్వారా ప్రజలలో దేశభక్తి హిందూ ధర్మం పట్ల మరియు సేవాభావమును పెంపొందించుటకు ఆర్ఎస్ఎస్ కృషి చేయుచున్నదని, సరిగ్గా విజయదశమి రోజున శ్రీరాముడు రావణున్ని వధించి..ధర్మాన్ని కాపాడి..ధర్మ పాలనకు కృషి చేశాడన్నారు. రాక్షసుల యొక్క బాధలను తట్టుకోలేక దేవతలందరూ చెల్లా చెదురైపోయినప్పుడు ఆదిపరాశక్తి తల్లి దుర్గామాత దేవతలందరి యొక్క శక్తిని తనలో ఇముడుచుకొని 10 చేతులతో 10 రకాల అస్త్రాలను ధరించి మహిషాసురుని వధించడం జరిగినదని, ఆ విధముగా చెడుపై మంచికి విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను హిందువులందరూ దేశంలోని అన్ని గ్రామాలలో నిర్వహించుకోవడం



జరుగుతుందన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం ప్రారంభమై 100 సంవత్సరాలకు వస్తున్న సందర్భముగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రతి నాలుగు గ్రామాలకు ఒక శాఖను పెట్టి, హిందువులను ఐక్యమత్యం చేసి, భారత దేశంలో, ప్రపంచంలో మొదటి స్థానంలో నిలబెట్టాలని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవర్గ బుర్ర సదయ్య, ఖండ సంఘచాల కనుకుల లక్ష్మారెడ్డి, వరంగల్ విభాగ్ సేవ ప్రముఖ కనుకుల చంద్రారెడ్డి, కండ సహకార్యవాహ శ్రీరాం రఘుపతి, గడ్డం వెంకటేష్, ముప్పిడోజు సాయికిరణ్, అల్లం మధుకర్, పుప్పాల సురేష్, కుడికాల శ్రీనివాస్, చిలుముల శ్రీనివాస్, చింతల సాయి వినయ్, ఆరెపల్లి శ్రీనివాస్, కనకం భద్రయ్య, బుర్ర వెంకన్న, గుండా మణికుమార్, వేల్పుల రాజు పాల్గొన్నారు.

# కాలుష్య నియంత్రణ మన తక్షణ కర్తవ్యం

**భూమిమీద కనీస బాధ్యత లేకుండా జీవనం తగదు**

**భవిష్యత్ తరలా కోసం మనమంతా కష్టపడాలి**

**డిప్యూడి సిఎం పవన్ కళ్యాణ్ పిలుపు**



**విజయవాడ,అక్టోబర్9:** రానున్న ఐదేళ్ల కాలంలో ఎంతవరకు కాలుష్యాన్ని నియంత్రించాలనే అంశంపై ఆలోచన చేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. నేను పర్యావరణ ప్రేమికుడిని.. ప్రకృతి బాగుండాలని కోరుకునే వ్యక్తిని.. ప్రకృతి ప్రేమికులు ఎంత తపన పడతారో నాకు తెలుసు. భూమి మీద కనీస బాధ్యత లేకుండా మనం జీవనం సాగిస్తున్నాం. భూమిని మనం సొంతం చేసుకోవడం కాదు.. భూమే ఏదొకనాటికి మనలను సొంతం చేసుకుంటుందని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో విజయవాడలో వర్కుషాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు నిపుణులు, మేధావులు, ఎన్జీవోల సూచనలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ వర్కుషాపు ద్వారా పరిశ్రమల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణ రెండు అంశాలపై వేసే అడుగులపై అందరికీ స్పష్టత వస్తుందన్నారు. ఈ పీసీబీ ఛైర్మన్‌కు నా ఆలోచన చెప్పిన వెంటనే.. ఈ వర్కుషాపును ఏర్పాటు చేశారు. అన్ని రంగాల నిపుణులు, ఎన్జీవోలను ఆహ్వానించడం అభినందనీయం. 974 కిలోమీటర్ల కోస్టల్ కారిడార్ ఉంది.. దానిని అభివృద్ధి చేయాలి. పర్యావరణ సమతుల్యత దెబ్బ తినకుండా.. పరిశ్రమల ఏర్పాటు కావాలి. భవిష్యత్ తరాల కోసం.. మనమంతా ఇప్పటి నుంచే ఆలోచన చేయాలి. జల, వాయి కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ వర్కుషాపుకు వచ్చిన నిపుణులు సలహాలతో సమాజానికి మరింత మేలు జరగాలనేది నా ఆకాంక్ష. మీ అనుభవం, మీ మేధస్సు ఈ రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడాలి. విపరీతంగా కాలుష్యం పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. కాలుష్య కోరల నుంచి సమాజాన్ని రక్షించడంలో మీరంతా పాత్రధారులు కావాలి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అంటే.. పరిశ్రమల యాజమాన్యాలలో అపోహలు ఉన్నాయి. ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడతారనే అభద్రత పీసీబీపై ఉంది. దీంతో ఆ తర్వాత పాలకులు పరిశ్రమల ద్వారా వచ్చే కాలుష్యాన్ని పట్టించుకోవడం మానేశారు. ఇక నుంచి పరిశ్రమల ఏర్పాటు, కాలుష్యం నివారణ రెండు అంశాలపైన ప్రత్యేక దృష్టి పెట్టాం. మీ అమూల్యమైన సలహాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని నా విజ్ఞప్తి అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో రిటైర్డ్ ఐఏఎస్ కృష్ణయ్య, ఐఏఎస్ జీ. అనంత రాము, వ్యర్థ పదార్థాల నిర్వహణలో పర్యావరణ సవాళ్లపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి. చంద్రుడు ఐఏఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. 'పరిశ్రమల అభివృద్ధితో పాటు, కాలుష్య నియంత్రణ కూడా అరికట్టేలా భాగస్వామ్యుల అభిప్రాయాలను తీసుకునేందుకు ఈ వర్కుషాపు. ప్రజల భాగస్వామ్యంతో సూచనలు, సలహాలతో ముందుకు సాగాలని భావిస్తున్నాం. అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. భవిష్యత్‌లో పరిశ్రమల ఏర్పాటు చేస్తూనే కాలుష్యాన్ని ఎలా నివారించాలనే దానిపైనా ఆలోచన చేస్తున్నాం. స్వచ్ఛంధ సంస్థలు కూడా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నాయి. వారి సలహాలు కూడా తీసుకుని, కాలుష్య నియంత్రణకు కృషి చేసేలా ముందుకు సాగుతాం. ఈ వర్కుషాపులో తమ విలువైన సూచనలు చేసేందుకు నిపుణులు కూడా అనేక మంది వచ్చారు. జల కాలుష్యం, వాయి కాలుష్యం నివారించేందుకు పర్యావరణ చట్టం తీసుకు వచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత పరిశ్రమలు ఎక్కువగా తెలంగాణాలోనే ఉండిపోయాయి. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే, ఆర్థిక ప్రగతి సాధించాలన్నా పరిశ్రమలు, అనుబంధ సంస్థలు అవసరం. కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుకు అందరూ కృషి చేయాలి. పరిశ్రమల ఏర్పాటు ఎంత ముఖ్యమో, ప్రజల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. అందరి అభిప్రాయాలు ఆలోచనలు పంచుకుని.. పరిశ్రమల ఏర్పాటుతో పాటు, కాలుష్య నివారణ లక్ష్యంగా పని చేయాలని కృష్ణయ్య వెల్లడించారు.

# కాంగ్రెస్‌వన్నీ విభజన రాజకీయాలు

**- హర్యానా ఫలితాలపై వక్రభాష్యాలు - మండిపడ్డ ప్రధాని మోడీ**

**ముంబయి,అక్టోబర్ 9:** సమాజంలో కాంగ్రెస్ విష బీజాలు నాటుతూ..హిందువులను విభజించాలని చూస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ తీరును విమర్శిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నా రని దుయ్యబట్టారు. హరియాణా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయాన్ని ప్రస్తావిస్తూ, అక్కడ కాంగ్రెస్ చేసిన కుట్రలన్నీ విఫలమయ్యాయని అన్నారు. మహారాష్ట్రలో రూ.7,600 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. హరియాణా ఎన్నికల్లో భాజపా చారిత్రాత్మక విజయం దేశ ప్రజల ఆలోచనను తెలియజేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతులు, దళితులు భాజపాకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ తమ రిజర్వేషన్లను లాక్కొని తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని దళితులు గ్రహించారు. దేశంలోని రైతులను కూడా కాంగ్రెస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ, తమకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ఎవరు ఇచ్చారో హరియాణా రైతులకు తెలుసు కాబట్టే వారు భాజపాను గెలిపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెప్పారని మోదీ అన్నారు. హరియాణాలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో ప్రజల్లో తమను తప్పుగా చూపించడానికి ఎన్నో కథనాలు రచించి.. ద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడిందని ఆరోపించారు. సమాజాన్ని నాశనం చేయడానికి పూనుకున్న ఈ శక్తులన్నింటికీ రాబోయే ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు తగిన సమాధానం ఇస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలు భాజపా-మహాయుతి ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఖండించారు. ప్రధాని రాజకీయ ప్రసంగాల కోసం ప్రభుత్వ కార్యక్రమాలను ఎందుకు ఉపయోగించుకుంటున్నారని ప్రశ్నించారు. ఇలాంటి ప్రసంగాల కోసం ప్రజల డబ్బును దుర్వినియోగం చేయకుండా భాజపా సొంత సొమ్ముతో వేదికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# ఎస్సీ వర్గీకరణ చేయకుండా డిఎస్సీ నియామకాలు

**- ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆందోళన - ఇందిరాపార్క్ వద్ద మందకృష్ణను అడ్డుకున్న పోలీసులు**

**తొలి సమయం హైదరాబాద్,అక్టోబర్ 9:** డిఎస్సీలో ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఆందోళన చేపట్టింది. ఈ క్రమంలో నగరంలో ఆందోళనకు దిగిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాల పోస్టులను భర్తీ చేయడాన్ని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ నుంచి మాదిగల నిరసన ప్రదర్శన చేపట్టారు. దీంతో ఈ నిరసనను పోలీసుల అడ్డుకున్నారు. ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతో పాటు, పలువురు ఎమ్మార్పీఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈక్రమంలో ఇందిరాపార్క్ వద్ద ఎమ్మార్పీ ఎస్ నేతలు, పోలీసులకు మధ్య వాగ్వివాదం తోపులాట ఉద్రిక్తతకు దారి తీసింది. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ నుంచి లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించ తలపెట్టిన మాదిగల నిరసన ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. అరెస్ట్ చేసిన ఆందోళ నకారులను నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి మాదిగలకు డీఎస్సీ ద్వారా వచ్చే ఉద్యోగాలను కల్పించిన తర్వాతే నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ముందుగానే నియామక పత్రాలు అందజేయడం వల్ల మాదిగలు అన్యాయానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా చేపట్టే ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు పాటించాలంటూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలను, కార్యకర్తలు ఉద్యమ కారులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయలేదా అని ప్రశ్నించారు. అలాగే ర్యాలీలు నిర్వహిస్తున్న వారిని అడ్డుకొని అరెస్ట్ చేయడం దారుణమంటూ మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ఉద్యోగాల భర్తీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందని.. మాదిగలను నట్టేట ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగల పట్ల ఎనలేని ప్రేమ ఉన్నట్లు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆచరించడం లేదని.. మాలల పక్షాన నిలుస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి మాలలకు కొమ్ము కాస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పీసీసీ చీఫ్‌గా మాదిగలకు తక్కువ సీట్లు ఇచ్చి.. మాలలకు ఎక్కువ టికెట్లు ఇచ్చారని మండిపడ్డారు. శాసనసభ ఎన్నికల్లో మాదిగలకు నాలుగు సీట్లు తగ్గడానికి కారణం రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణను తొలుత దేశంలో అమలు చేసే రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని చెప్పారని గుర్తుచేశారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన అర్ధ గంటకే రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన ఉద్యోగాలకు కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పారని తెలిపారు. అయితే రెండు నెలలు కాకముందే రేవంత్ రెడ్డి మాదిగలకు వెన్నుపోటు పొడిచారని విరుచుకుపడ్డారు.

## మృతుని కుటుంబానికి అల్లం రవీందర్ ఆత్మీయ పరామర్శ




**తొలి సమయం భూపాలపల్లి 9:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన బుర్ర మహేష్ గౌడ్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. కాగా బుధవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ మృతుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని పరామర్శించి..తమ ప్రవగాడ సానుభూతిని తెలియజేసి..ఓదార్చారు. మృతుడు మహేష్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, సర్గలోక ప్రాప్తిరస్తు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మాజీ జడ్పిటిసి గొర్రె సాగర్, బీఆర్ఎస్ నాయకులు పిట్ట సురేష్, కట్కూరి రాజేందర్, ములుగురి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ కనకదుర్గమ్మను దర్శనం చేసుకున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు మంగళ పెల్లి హుస్సేన్



**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 9:** విజయవాడ సెప్టెంబర్ 09 బుధవారం కృష్ణా డిస్ట్రిక్ట్ ఆంధ్రప్రదేశ్ దేవి నవరాత్రులు దినోత్సవం సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా టీం సభ్యులు జాతీయ అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్ 7 వ రోజు సందర్భంగా అమ్మ వారు మూలా నక్షత్రం సరస్వతి దేవి అలంకరణ లో ఉన్న అమ్మవారును వారు దర్శనం చేసుకోవడం జరిగింది, దేవీ నవరాత్రులు ఉత్సాలలో పఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ, దేవస్థానం సిబ్బంది,మున్సిపల్ కార్మికులు, వాలంటీర్లు,అన్ని వసతులు సక్రమంగా ఏర్పాటు చేశారని దర్శనానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేశారు అమ్మవారి దర్శనం సంతోషంగా జరిగిందని ఈ సందర్భంగా అన్నారు,ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర మహిళా ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ వాణి మహబూబాబాద్ జిల్లా మద్ది పెద్ది సంధ్య,నవీను, పెద్ద గాని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## దసరా బస్సుల్లో ప్రత్యేక చార్జీలు

**వెల్లడించిన ఆర్టీసీ ఎండి సజ్జన్నార్**

**తొలి సమయం హైదరాబాద్,అక్టోబర్ 9:** పండుగ వేళ ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం షాకింగ్ న్యూస్ చెప్పింది. దసరా వేళ స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లు పెట్టేందుకు సిద్ధమైంది. దసరా రద్దీ దృష్ట్యా స్పెషల్ బస్సులు నడుపుతున్నామని ప్రకటించిన ఆర్టీసీ.. ఆ బస్సుల్లో ప్రత్యేక ఛార్జీలు ఉంటాయని స్పష్టం చేసింది. దసరా రద్దీ నేపథ్యంలో ప్రత్యేకంగా 6,300 బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ ఎంపీ సజ్జనార్ ప్రకటించారు. అలాగే మహాలక్ష్మి స్కీమ్ కింద మరో 600 బస్సులను అదనంగా నడిపిస్తున్నామన్నారు. అయితే స్పెషల్ బస్సుల్లో అదనపు ఛార్జీలు ఉంటాయని సజ్జనార్ స్పష్టం చేశారు. రిటర్న్ జర్నీలో ఖాళీగా బస్సులు రావాల్సి ఉంటుందని.. అందుకే కొంత ఛార్జీలు పెంచడం జరిగిందని సజ్జనార్ వివరించారు.ఇప్పటికే కొన్ని బస్సులు నడుస్తున్నాయని.. గురువారం నుంచి మొత్తం బస్సులను నడిపిస్తామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకు ఈ స్పెషల్ బస్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అయితే, మహాలక్ష్మి పథకంలో భాగంగా ఫ్రీ జర్నీ చేసే మహిళలు తప్పకుండా తమ ఆధార్ కార్డు చూపించాలని స్పష్టం చేశారు. కార్డు చూపించకుండా ఆర్టీసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. దసరా సందర్భంగా నగరంలోని ప్రజలు తమ తమ సొంతూళ్లకు పయనం అవుతున్నారు. ఇప్పటికే స్కూళ్లు, కాలేజీలకు హాలిడేస్ ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం. దీంతో హైదరాబాద్‌లో హాస్టళ్లలో ఉండి చదువుకునే కాలేజీ విద్యార్థులంతా ఊరు బాట పట్టారు. పెద్దలు సైతం తమ తమ సొంతూళ్లకు పయనమవుతుండటంతో ఆర్టీసీ బస్టాండ్‌లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడు తున్నాయి. బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. ఇప్పటికే ప్రయాణికులకు సరిపడా బస్సులు లేవని ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. మరో రెండు రోజులు పోతే.. ప్రయాణికుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని.. మరిన్ని బస్సులను నడపాలని ఆర్టీసీ యాజమాన్యానికి ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పారదర్శకంగా మద్యం టెండర్లు

**రాజకీయ జోక్యాన్ని సహించబోమన్న బాబు**

**విజయవాడ,అక్టోబర్ 9:** మద్యం టెండర్లు పారదర్శకంగా జరగాలని సిఎం చంద్రబాబు అన్నారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొనే నేతలను సహింబోనని చెప్పారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే చర్యల్ని ఉపేక్షింబోనని హెచ్చరించారు. పొలిటికల్ గవర్నెన్స్ అంటే ప్రజల్ని ఇబ్బంది పెట్టడం కాదు.. ప్రజలకు మంచి చేయడం. ఇసుక లభ్యత తక్కువ ఉన్నందున కొన్నిఇబ్బందులు వచ్చాయి. తక్కువ ధరకే ఇసుక ఇచ్చేలా ఆలోచిస్తున్నాం. ఇసుక సరఫరాలో ఎవరి జోక్యం లేకుండా చేస్తాం' అని చంద్రబాబు తెలిపారు.ఇదిలావుంటే గత ఐదేళ్లలో అందరికంటే ఎక్కువ ఇబ్బంది పడింది తానేనని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. 53 రోజులు జైల్లో ఉన్నది తానేనని, తనని చంపాలని చూశారనే ప్రచారమూ జరిగిందన్నారు. తాను ఉన్న జైలుపై డ్రోన్లు కూడా ఎగురవేశారన్నారు. బుధవారం మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. తన ప్రతీ కదలికను గమనించడానికి జైలు గదిలో సీసీ కెమెరా కూడా పెట్టారన్నారు. కనీసం వేడి నీళ్లు ఇవ్వకపోగా.. దోమలు కుడుతుంటే కనీసం దోమ తెర లేకపోవడంతో ఎంతో ఇబ్బంది పడ్డానన్నారు. ఇంత అనుభవించిన తాను బయటకు రాగానే ముందు కక్ష తీర్చుకోవాలి కదా అన్న చంద్రబాబు.. తనది ఆ స్వభావం కాదన్నారు.

## ధాన్యం సేకరణపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

**తొలి సమయం హైదరాబాద్,అక్టోబర్ 9:** ధాన్యం సేకరణకు సంబంధించిన పలు అంశాలపై అధ్యయనం చేసి సిఫార్సులు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావుతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు.

# బిజెపి సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

## బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్




**తొలి సమయం, కరీంనగర్, అక్టోబర్ 09**
కరీంనగర్ జిల్లాలో బిజెపి సభ్యత్వ నమోదును కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి భారతీయ జనతా యువ మోర్చా శ్రేణులు తగిన కృషి చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ లోని కమాన్ వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో జరిగిన బిజెపి మెంబర్షిప్ డ్రైవ్ ప్రోగ్రాం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మెంబర్షిప్ డ్రైవ్ కోసం రాష్ట్ర బిజెపి టార్గెట్ పెట్టుకుందని, ఆ టార్గెట్ ను రీచ్ కావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బిజెపి మెంబర్షిప్ డ్రైవ్ లో యువతను భాగస్వామ్యం చేయడానికి బీజేవైఎం ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా దేశంలో, ప్రపంచంలోనే అతిపెద్ద కార్యకర్తలు కలిగిన పార్టీగా బిజెపి అవతరించింద న్నారు. బిజెపి సిద్ధాంతం పట్ల, బిజెపి పాలనపట్ల అన్ని వర్గాల ప్రజలు, మహిళలు,యువకులుఎంతో విశ్వాసంతో ఉన్నారని తెలిపారు.

బిజెపి కుటుంబంలో చేరడానికి అనేకమంది ఉత్సాహం చూపుతున్నారని , రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో లక్షల మంది నూతన సభ్యత్వం తీసుకున్నారన్నారు. ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా బలమైన పార్టీగా నేడు భారతీయ జనతా పార్టీ ఉందని, ఇదంతా కార్యకర్తల కార్యకర్తల సమిష్టి కృషితోనే జరిగిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సభ్యత్వ నమోదు ప్రోగ్రామ్ ను విజయవంతం చేయాల్సిన బాధ్యత బూత్ స్థాయి కార్యకర్త మొదలుకొని గ్రామ మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకుల వరకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్,తరుణ్,కోశాధికారి యోగిరాజ్,రాష్ట్ర కార్యదర్శి యువక్రాంతి,రాష్ట్ర నాయకులు సంతోష్,అవినాష్,జిల్లా నాయకులు శ్రీరాములు శ్రీకాంత్,అజయ్ దేవరకొండ తదితరులు పాల్గొన్నారు.

# స్టేషన్ ఘనపూర్ బస్ స్టాండ్‌లో వరంగల్ షీ టిమ్ అవగాహనా సదస్సు




**తొలి సమయం, హన్మకొండ, అక్టోబర్, 09**
షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ బి. భాస్కర్ మాట్లాడుతూ నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో ప్రజలు అందరు కూడా భాగస్వామ్యం కావాలని తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని , జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ బి. భాస్కర్ అన్నారు. స్టేషన్ ఘనపూర్ బస్ స్టాండ్ లో దాదాపు 100 మంది ప్రయాణికులుకు సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అత్యాచారాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఈ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రయాణికులుకు ఈవ్ టీజింగ్ గురించి,బస్సు లో ప్రయాణిచ్చేటప్పుడు ఆకతాయుల పట్ల జాగ్రత్తగా ఉండాలని,గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని మరియు టి -సేఫ్ అప్ పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై,టి -సేఫ్ అప్ పై అవగాహన కలిగి ఉండాలని, అన్నారు మరియు సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి పిర్యాదు చేయాలి. అన్నోన్ నెంబర్స్ నుండి మహిళలకు ఎవరి నుండైన ఇబ్బందులుకు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని,మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సి. పి. వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్. ఐ. వాట్సాప్ నెంబర్ 8712685270 కి పిర్యాదు చేసినవారి వివరాలను చాలా గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిపై చట్టరీత్య తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ బి.భాస్కర్ , ఉమెన్ కానిస్టేబుల్ పూర్ణ స్టేషన్ ఘనపూర్ పోలీస్ స్టేషన్ సీఐ వేణు గారి ఆధ్వర్యంలో ఎస్ ఐ భాగ్యలక్ష్మి , హెడ్ కానిస్టేబుల్ ఏకంభ్రం. కానిస్టేబుల్ రఘు, శ్రీను,బస్సు స్టాండ్ మాస్టర్ ఈ. స్ బాబు తదితరులు హాజరైనారు.

# నియోజకవర్గంలో జర్నలిస్టుల అక్రమ వసూళ్లు చేస్తున్న వారిపై ఇంటిలిజెన్సీ ఆరా

**తొలి సమయం, హుజురాబాద్, అక్టోబర్ 09**
దసరా వచ్చింది దిశ మార్చింది అంటూ అందరూ పండగ వాతావరణం జరుపుకుంటుంటే కొంతమంది రిపోర్టర్లు మాత్రం ఒక ముఠాగా ఏర్పడి దసరా మామూళ్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. హుజురాబాద్ నియోజకవర్గం లో కొంతమంది రిపోర్టర్లు అని చెప్పుకుంటూ ప్రభుత్వ అధికారులను డాక్టర్లను వ్యాపారస్తులను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమంగా మామూళ్ల పేరుతో దర్జాగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటన నియోజకవర్గంలోని ఇల్లంతకుంట,వీణవంక, జమ్మికుంట, హుజురాబాద్ మండల కేంద్రాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది జర్నలిస్టులం అంటూ నిర్బంధ వసూళ్లకు పాల్పడుతున్నారు. కనీసం జర్నలిజం పై అవగాహన లేదు వార్తలు రాయడం చేతకాని వాళ్లు వాట్సాప్ గ్రూపులో వచ్చిన వార్తలను పెట్టుకుని ఒక ముఠాగా ఏర్పడి డాక్టర్లను అధికారులను వ్యాపారస్తులను బెదిరిస్తూ దసరా మామూలు ఇవ్వాల్సిందే అంటూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ వారి పబ్బం గడుపుకుంటున్నారు. అసలే పండగ పూట వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్న వ్యాపారస్తులు వీరి ఆగడాలను భరించలేక కొంతమంది పోలీసులను ఆశ్రయించడానికి సిద్ధపడుతున్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండి విలువలతో కూడిన వార్తలను ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన పవిత్రమైన జర్నలిస్టు వృత్తికి ఇలాంటి వారి వల్ల చెడ్డ పేరు వస్తుంది. కనీసం ఇంటికి పోతే తినడానికి తిండి కూడా ఉండదు బయట మాత్రం మేము విలేకరులు మేము ఏమైనా చేస్తాం అంటూ తమ పెత్తనాన్ని కొనసాగిస్తున్నారు. జర్నలిస్టుల ముసుగులో భయభ్రాంతులకు గురి చేస్తున్న ఇలాంటి అర్హత లేని జర్నలిస్టులు ఎవరైనా మామూళ్ల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని పలు జర్నలిస్టు సంఘ నాయకులు బహిరంగంగానే తెలుపుతున్నారు. జర్నలిస్టుల ముసుగులో అక్రమాలు చేస్తున్న వారిపై ఇప్పటికే ఇంటలిజెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. ఎవరెవరు ఎక్కడ ఎంత వసూలు చేశారనేది పూర్తిస్థాయిలో అధికారుల వద్ద ఆధారాలు ఉన్నట్లు తెలుస్తుంది.

ప్రభుత్వ అధికారులు డాక్టర్లు వ్యాపారులు సైతం ఇలాంటి వాళ్లకు భయపడి వారు అడిగిన మామూలు ఇస్తే వారిని ప్రోత్సహించినట్లు అవుతుందని ఎవరు కూడా ఇలాంటి వారిని ప్రోత్సహించకూడదని నిజమైన జర్నలిస్టులు ఇలాంటి పనులు చేయారని పలువురు సీనియర్ పాత్రికేయులు బహిరంగంగానే తెలుపుతున్నారు.


# చెరువును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుంది

## - ఉచిత చేప పిల్లల పంపిణి - మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**తొలి సమయం, స్టేషన్ గన్పూర్ అక్టోబర్ 09**
ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ రిజర్వాయర్ లో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లికి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య సంపద పెంచాలని తద్వారా మత్స్య కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి చేపట్టినట్లు తెలిపారు.



తెలంగాణ రాష్ట్రంలో జలాశయాలలో నీరు సమృద్ధిగా ఉండడం వల్ల చేప పిల్లల పెంపకానికి అనువైన వాతావరణం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపలను దిగుమతి స్థాయి నుండి ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం శుభ పరిణామం పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జలాశయాలలో 45కోట్ల చేప పిల్లల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేసిందని అందుకోసం 52కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. మత్స్య కార్మిక సంఘాలలో సభ్యులైన ప్రతీ ఒక్కరికి 5లక్షల ఉచిత ప్రమాద భీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టులో మొట్టమొదటి రిజర్వాయర్ ధర్మసాగర్ రిజర్వాయర్ అని తెలిపారు. ధర్మసాగర్ రిజర్వాయర్ సాగు నీటితో పాటు త్రాగు నీటిని కూడా అందిస్తుందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎవరిన్ని విమర్శలు చేసినా దేవాదుల ప్రాజెక్టును ప్రారంభించినట్లు తెలిపారు. 2ఏళ్లలో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు రెండు పంటలకు సాగు నీరు అందించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. త్వరలోనే నక్కల తూము ద్వారా ధర్మసాగర్ రైతులకు సాగు నీరు అందిస్తామని అన్నారు. ప్రకృతి అందాలతో కూడిన ధర్మసాగర్ రిజర్వాయర్ మరియు దేవునూర్ గుట్టలను కలిపి ఎకో టూరిజం ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. రిజర్వాయర్ కు నాలుగు వైపులా ఉన్న కాల్వల ద్వారా చేపలు వెళ్ళిపోకుండా ఉండడానికి అవసరమైన ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చేపల మార్కెట్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని వెంటనే గుర్తించాలని స్థానిక ఎమ్మార్వో కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపిడివో, మత్స్య శాఖ అధికారులు, మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు సుధాకర్, డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, ముదిరాజ్ కులస్తులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.








# చెస్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం



**తొలి సమయం, ఎల్కతుర్తి, అక్టోబర్ 09**
ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలో చెస్ క్లబ్ ఆధ్వర్యంలో వారం రోజుల నుండి విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. బుధవారం రోజునా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసారు. ముఖ్య అతిధిగా ప్రపంచ చెస్ ఛాంపియన్ అర్జున్ ఇరిగేష్ తల్లి జ్యోతి హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. అనంతరం తాను మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా ఆడాలని అన్నారు. అర్జున్ ఇష్టంతో ఆడి ప్రపంచ చెస్ ఛాంపియన్ అయ్యాడాని తెలిపారు. పిల్లలు ఇష్టంగా ఆడి ఉన్నత శిఖరాలకు వెళ్లాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సుదీర్ రావు, శ్రీనివాస్ రావు, వాణి శెట్టి, రాజన్న, వంశీ, కృష్ణ,గణేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# డాక్టర్ సీటు సాధించిన హెూం గార్డ్ కుమార్తె

**తొలి సమయం, హన్మకొండ, అక్టోబర్ 09**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ యం.టి విభాగంలో డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్న గుంటికంటి కుమార స్వామి కుమార్తె వర్షిత కన్వీనర్ కోటాలో స్థానిక హంటర్ రోడ్ లోని కొలంబో వైద్య కళాశాల లో యం.బి.బి.ఎస్ లో సిటు సాధించింది. ఈ సందర్భంగా యం.బి.బి.ఎస్ సీటు సాధించిన హెూంగార్డ్ కుమార్తె ను వరంగల్ పోలీస్ కమిషనర్ పుష్పాగుచ్చలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్ళు వున్న పిల్లలు చదువుల పట్ల అశ్రద్ధ వహించవద్దని వారిని ఉన్నత చదువులు చదివే విధంగా ప్రోత్సాహించాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో

# బతుకమ్మ సందడి



**తొలి సమయం, హన్మకొండ, అక్టోబర్ 09**
వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకున్నారు. బతుకమ్మ నవరాత్రులను పురస్కరించుకొని మహిళా పోలీస్ సిబ్బంది అధికారులు కుటుంబం సభ్యులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ కుటుంబ సమేతంగా కలిసి వచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ బతుకమ్మ తయారు చేసిన భరోసా సిబ్బందికి పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు

# అర్ధరాత్రి తమ్ముడిని హత్య చేసిన అన్న.





**తొలి సమయం, సైదాపూర్,అక్టోబర్ 09**
మండలంలోని దుద్దెన పల్లి గ్రామంలో అర్ధరాత్రి తమ్ముడిని హత్య చేసిన అన్న ఘోరమైన ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు కుందేల్ల చంద్రు(24),కుందేల్ల కుమార స్వామి అన్నదమ్ములు ఒకే ఇంట్లో ఉంటున్నారు.ఐతే గతంలో అన్నదమ్ములకు కుటుంబ కలహాలతో గొడవలు జరిగాయి.మంగళవారం రాత్రి అన్నద మ్ములు ఇరువురు మద్యం సేవించి ఉండడం తో ఇదే అదునుగా భావించిన అన్న కుందేల్ల కుమారస్వామి తమ్ముడు చెంద్రు ను తలపై రాడుతో బలంగా కొట్టడంతో రక్తం మడుగులో అక్కడికి అక్కడే మృతి చెందాడు.మృతినికి వివాహం కాలేదు.పోలీసుల కుమారస్వామిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

# మహా నగర ప్రజలకు బతుకమ్మ పండగ శుభాకాంక్షలు మేయర్ గుండు సుధారాణి

**తొలి సమయం, వరంగల్, అక్టోబర్ 09**



వరంగల్ మహా నగర ఆడపడుచులు అందరికీ నగర మేయర్ గుండు సుధారాణి బతుకమ్మ పండగ (అక్టోబర్ 10) శుభాకాంక్షలు తెలిపారు. పూలనే దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, ప్రత్యేక సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు.ప్రతి ఒక్కరూ పండగని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవా లని మేయర్ ఈ సందర్భంగా కొరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా నిర్వహిస్తున్నదని మేయర్ తెలిపారు.

# ఓడిపోతే ఈవీఎంలది తప్పా ?

**తొలి సమయం హైదరాబాద్,** హర్యానా, జమ్ముకాశ్మీర్ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. హర్యానాలో బిజెపి హ్యాట్రిక్ విజయం సాధించగా కాశ్మీర్‌లో ఇండియా కూటమి గెలిచింది. ఎన్‌సితో పొత్తు ద్వారా కాశ్మీర్‌లో కాంగ్రెస్ కొన్ని సీట్లు సాధించుకో గలిగింది. ఇక హర్యానాలో గెలుస్తారని సర్వేలు చెప్పినా..అనూహ్యంగా బిజెపి పుంజుకుని విజయం సాధించింది.ఇంతవరకు బాగానే ఉన్నా..మరోమారు కాంగ్రెస్ తన అనుమానాలను బయటపెట్టింది. ఇవిఎంల ట్యాంపరింగ్ అంటూ పాత పాట పాడింది. కాశ్మీర్‌లో కూడా ట్యాంపరింగ్ జరిగివుంటే బిజెపి గెలిచేది. హర్యానాలో ట్యాంపర్ చేసిన బిజెపి,కాశ్మీర్‌ను మాత్రం వదులుకుంటుందా అన్నదే ప్రశ్న. కాంగ్రెస్ ఆరోపణలు చేస్తే రెండు రాష్ట్రాలపై చేయాలి. వారు గెలిచిన కర్నాటక, తెలంగానల పైనా చేయాలి. కానీ గెలిచిన చోట వదిలి ఓడిన చోట ట్యాంపరింగ్ అంటే ప్రజలు నమ్మడానికి సిద్దంగా లేరు. పదేళ్ల యూపిఎ పాలన అంతా ట్యాంపరింగ్ గెలుపుతో నడిచిందా అన్నది కూడా కాంగ్రెస్ చెప్పాలి. ట్యాంపరింగ్ అనుమానాలపై ఇప్పటికే నివృత్తి జరిగింది. ఇసి పలు సందర్భాల్లో వాటిని ఎలా వినియోగిస్తున్నదీ వివరించింది. టెక్నికల్ టీమ్ వాటిని సరిచూసింది. ఈ క్రమంలో ఇవిఎంలపై అనుమానాలను మాత్రం బిజెపి కొట్టి పారేస్తోంది. సాంకేతికత అభివృద్ధి చెందిన తరుణంలో దీనిపై అనుమానాలు అక్కర్లేదు. ఇవిఎంల ట్యాంపరింగ్ పై అనుమానాలు వ్యక్తం చేస్తూ..తమను ప్రజలు తిరస్కరించారన్న నిజాన్ని కాంగ్రెస్ అంగీకరించడం లేదని అందరూ గుర్తుంచుకోవాలి. గతంలో అనేకమార్లు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ ఈ విషయంలో ఆనాడు అనుమానాలు వ్యక్తం చేయలేదు. తాజాగా ఇప్పుడు మారోమారు ఇవిఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఇవిఎంలతోనే గతంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ నిస్సిగ్గుగా మాట్లాడడం దారుణం కాక మరోటి కాదు. ఇకపోతే కాంగ్రెస్ ఒంటరిగా పోటీచేస్తున్నప్పుడల్లా ఓటమి చెందుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియాకూటమితో పోవడంతోనే ఈ మాత్రం సీట్లు సాధించగలిగింది.హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి శరాఘాతంగా మారడంతో నెపాన్ని ఇవిఎంలపైకి నెట్టేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఓ 30 పార్టీలతో జతకట్టి 'ఇండియన్ నేషనల్ డెవలప్ మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ ఇండియా పేరుతో కూటమిని కట్టి భారతీయ జనతా పార్టీని కొంత మేర నిలువరించగలిగింది. అంతే తప్ప బీజేపీ సారథ్యంలోని 'నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఎన్‌డిఎ విజయాన్ని మాత్రం అడ్డుకోలేకపోయింది. గత పదేళ్లలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను చూస్తే బీజేపీతో ముఖాముఖి తలపడ్డ అనేక సందర్భాల్లో ఓటమి పాలవుతూ వస్తోందని అర్థమవుతోంది.తాజాగా జరిగిన రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగా బీజేపీని ఢీకొట్టలేక హర్యానాలో చతికిలపడగా.. జమ్ము-కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ తో జతకట్టి గెలుపును సొంతం చేసుకుంది. ఇంకా లోతుగా వెళ్తే.. ఇక్కడ బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడ్డ చోట్ల కమలదళానిదే పైచేయి. కాంగ్రెస్ పోటీ చేసిన 39 సీట్లలో కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. కాంగ్రెస్ గెలిచిన సీట్లలో ఒక్కటి కూడా హిందూ జనాభా ఎక్కువగా ఉన్న సీటు లేదు. గెలిచిన అభ్యర్థుల్లో ఒక్కరు కూడా హిందువు లేరు. దీన్ని బట్టి ఆ కొన్ని సీట్లు కూడా నేషనల్ కాన్ఫరెన్స్ పుణ్యమే అని స్పష్టమవుతోంది. హర్యానాలో జాట్-దళిత-మైనారిటీ కాంబినేషన్‌తో ఒంటరిగా గెలుపొందాలని చేసిన ప్రయత్నం చాలావరకు కలిసొచ్చినా.. జాటేతర వర్గాలు బీజేపీ వైపు ఏకీకృతం కావడంతో అనుకున్నది సాధించలేకపోయింది. కనీసం ఆమ్ ఆద్మీ పార్టీ, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, బహుజన్ సమాజ్ పార్టీలలో ఏ ఒక్క పార్టీతో పొత్తు పెట్టుకున్నా పరిస్థితి మరోలా ఉండేదని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఎందుకంటే బీజేపీ, కాంగ్రెస్ సాధించిన ఓట్ల శాతంలో వ్యత్యాసం 1 శాతం కంటే తక్కువే. బీజేపీ 39.94 శాతం ఓట్లతో 48 సీట్లు గెలుపొందగా, కాంగ్రెస్ 39.09శాతం ఓట్లు సాధించినప్పటికీ 37 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. అనేక నియోజకవర్గాల్లో గెలుపోటముల మధ్య తేడా వందల్లోనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఏ ఇతర పార్టీతో జతకట్టినా కాంగ్రెస్ అధికారం సాధించగలిగేదని స్పష్టమవుతోంది. జాతీయస్థాయిలో బీజేపీని ఓడించడమే ఏకైక లక్ష్యంగా 30 పార్టీలను ఏకతాటిపైకి తెచ్చిన కాంగ్రెస్, అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో కొన్నిచోట్ల మాత్రం తాను మాత్రమే గెలవాలి.. మరొకరికి భాగం ఉండరాదు అన్నట్టుగా వ్యవహరించింది. తనకు తగిన బలం లేదు అనుకున్న రాష్ట్రాల్లో మాత్రమే స్థానికంగా బలంగా ఉన్న ప్రాంతీయపార్టీలతో జట్టుకట్టి పోటీ చేస్తోంది. 2022లో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడి ఓటమిపాలైంది. ఉత్తరాదిన హిమాచల్‌లో మాత్రమే గెలుపొందగలిగింది. తెలంగాణలో విజయం సాధించినప్పటికీ.. అక్కడ పోటీపడింది కేవలం బీజేపీతో మాత్రమే కాదు. అప్పటి వరకు తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితితో తలపడి ముక్కోణపు పోటీలో 39 శాతం ఓట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ లెక్కన చూస్తే బీజేపీతో నేరుగా తలపడడంలో కాంగ్రెస్ తడబడుతోందని స్పష్టమవుతోంది. ఓ ఇద్దరు ముగ్గురిని వెంటేసుకుని వెళ్తేనో.. లేకపోతే ముక్కోణపు పోటీ లేదా బహుముఖ పోటీ ఉన్నప్పుడో కాంగ్రెస్ విజయాలు సాధించగల్గుతోంది. ఈ విజయాలను విశ్లేషించుకుని కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగాలి. ఇవిఎంలపై నెపాన్ని నెట్టేసి, అది మోడీ కుట్ర అంటూ సాగితే ప్రజలు స్వాగతించరని గుర్తించాలి. హర్యానాలో ఓటమి గుణపాఠం కావాలి. మరింత పట్టుదలగా పనిచేయాలి. అధికారం ఉన్న రాష్ట్రాల్లో ఆదర్శ పాలన అందించాలి. ఢిల్లీ ప్రదక్షిణలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. చీటికిమాటికి మంత్రులు, ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిపించుకునే సంస్కృతి పోవాలి.

## కాంగ్రెస్‌కు కలసి రాని ఒంటరి పోరు

**కూటమి పోటీతోనే మంచి ఫలితాలు**

**విధానాలు మార్చుకుంటేనే కాంగ్రెస్‌కు భవిష్యత్**

**న్యూఢిల్లీ,అక్టోబర్9:**హిందీ హార్ట్‌ల్యాండ్‌గా పేరుగాంచిన ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నేటికీ పట్టు సాధించలేకపోతోంది. గత పదేళ్లలో చత్తీస్‌గఢ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో అధికారం అందినా ఐదేళ్ల తర్వాత రెండోసారి గెలుపొందలేక పోయింది. ఇందుకు కారణాలను ఆ పార్టీ విశ్లేషించుకోవడం లేదు. కేవలం ఇవిఎంలపైననో లేదా మోడీపై ననో విమర్శలు చేస్తూ తప్పించుకోవడం కుదరదు. ఓటమికి కారణాలను కనుగొనాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలి. అదేపనిగా మోడీని తిడుతూ కూర్చుంటే గెలవలేమని గుర్తించాలి. రాజకీయాల తీరు తెన్నులు మారేలా నడుచుకోవాలి. అప్పుడే కాంగ్రెస్‌ను ప్రజలు నమ్ముతారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పట్టు సాధిస్తే తప్ప జాతీయ రాజకీయాల్లో విజయాలు సాధించలేమని ఆ పార్టీ వ్యూహకర్తలకు తెలుసు. ఇదే సమయంలో భారతీయ జనతా పార్టీ మాత్రం నానాటికీ బలపడుతూ హిందీ రాష్ట్రాల్లో గట్టి పట్టు సాధిస్తూ ముందుకు కదులుతోంది. గత మూడున్నర దశాబ్దాల్లో బీజేపీ 2 పర్యాయాలు సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ మార్కు దాటింది. ఈసారి కాస్త 30కి పైగా పార్టీలతో ఏర్పడ్డ ఇండి-కూటమిని ఎదుర్కోవడంలో కాస్త తడబడాల్సి వచ్చింది. త ఏడాది 34 పార్టీలతో ఏర్పాటైన ఇండి-కూటమి అనేక రాష్ట్రాల్లో కలిసి పోటీ చేసినప్పటికీ.. 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కాంగ్రెస్ ఒంటరిగానే బీజేపీని ఢీకొట్టింది. వాటిలో దక్షిణాదిన కర్ణాటకలో మాత్రమే నేరుగా బీజేపీతో తలపడగా, మిగతా రాష్ట్రాల్లో స్థానిక ప్రాంతీయ పార్టీలు, కూటములతో తలపడింది. కర్ణాటకలో బీజేపీ మీద, తెలంగాణలో బీఆర్ఎస్ మీద మెరుగైన ఫలితాలు సాధించింది. కేరళలో కాంగ్రెస్ సారథ్యంలోని కూటమి 20కి 18 చోట్ల గెలుపొందింది. తమిళనాడులో మిత్రపక్షం ద్రవిడ మున్నేట్ర కళగంతో కలిసి గణనీయమైన సంఖ్యలో సీట్లు సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేక పోయింది. ఇక, ఉత్తరాది రాష్ట్రాల్లో ... బిహార్, జార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, జమ్ము-కాశ్మీర్‌లో స్థానికంగా బలంగా ఉన్న మిత్రపక్ష ప్రాంతీయ పార్టీలపైనే ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. బెంగాల్‌లో కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసినా ఆరాష్ట్రంలో ప్రధాన పోరు తృణమూల్ కాంగ్రెస్ , బీజేపీ మధ్యనే సాగింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీతో జట్టుకట్టినా, ఆ స్నేహం పంజాబ్‌లో అమలు కాలేదు. అయితే కొన్ని చోట్ల ఈ కూటములు, పొత్తులు ఫలించి కాంగ్రెస్ సీట్ల సంఖ్య పెరగడానికి దోహదపడ్డాయి. మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్ బాల్ ఠాక్రే వర్గం), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం)తో కలిసి కొన్ని సీట్లు, యూపీలో సమాజ్‌వాదీ పార్టీ తో కలిసి కొన్ని కాంగ్రెస్ ఖాతాలో అదనంగా చేరాయి. హర్యానా ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్నజీవిగా మారిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 99 సీట్లలో సగం వరకు మిత్రపక్షాల బలంతోనే వచ్చాయని సూత్రీకరించారు. అయితే మిత్రపక్షాలు కాంగ్రెస్‌పై ఆధారపడిన రాష్ట్రాల్లోవారి ఎన్నికల నౌకలు మునిగిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ఎంత పరాన్నజీవి అంటే అది తన సొంత మిత్రులను మింగేస్తుందని మోదీ విరుచుకుపడ్డారు. తన గెలుపు కోసమే పొత్తు.. తాను ఒంటరిగా గెలిచేలా ఉంటే ఎవరూ వద్దు అన్నది కాంగ్రెస్ విధానంగా కనిపిస్తోంది. అదే ఇప్పుడు ఆ పార్టీని వరుస ఓటములతో ముంచేస్తోంది. ఈ తరహా రాజకీయాలు కాకుండా కలిసి పోరాడే విధంగా పార్టీని బలోపేతం చేసుకోవాలి. కులరాజకీయాలు, కుటుంబ రాజకీయాలను పక్కన పెట్టాలి. సమిష్టి రాజకీయాలకు పెద్దపీట వేయాలి. ఆ దిశగా కాంగ్రెస్ అడుగులు వేయగలిగితేనే మంచి ఫలితాలు వస్తాయి.

## అనుమానాలు రేకెత్తిస్తున్న హర్యానా ఫలితాలు

**ఎపిలాగేనే అనుమానాస్పదంగా ఉన్నాయి**

**అనేక దేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ పేపర్లే వాడకం**

**ఎక్స్‌లో పోస్ట్ చేసిన వైకాపా అధినేత జగన్**



**అమరావతి,అక్టోబర్ 9:**హర్యానా ఎన్నికల ఫలితాలపై ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. ఏపీలో వచ్చినట్లుగానే అక్కడ కూడా ఆశ్చర్యకరమైన ఫలితాలు వచ్చాయని అన్నారు. ప్రపంచంలో చాలా అభివృద్ధి చెందిన దేశాలు బ్యాలెట్లతోనే ఎన్నికలు జరుపుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం కలిగించేందుకు బ్యాలెట్లతో ఓటింగ్ జరపాలని జగన్ కోరారు. తన ట్వీట్‌ను దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలకు జగన్ ట్యాగ్ చేశారు. ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా హర్యానా ఎన్నికల ఫలితాలు ఉన్నాయని జగన్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఏపీలోలాగే హర్యానాలో ఎన్నికల ఫలితాలు వచ్చాయన్నారు. ఫలితాలు ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాయని, ఇప్పటికే ఎన్నికల ఫలితాలపై కోర్టులో కేసులు నడుస్తున్నాయని జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో డెమోక్రసీ ప్రబలంగా ఉండటమే కాకుండా అభివృద్ధి చెందేలా చూడాలంటూ చెప్పుకొచ్చారు. హర్యానా ఫలితాలు తమకు అనుకూలంగా వస్తాయని భావించిన కాంగ్రెస్ అంచనాలు తప్పడంతో ఆ పార్టీ నేతలు ఈవీఎంలపై అనుమానాలను వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం తీరుపైనా ప్రశ్నలు సంధించారు. వార్యానాలో మొత్తం 90 సీట్లకు 48 స్థానాల్లో బీజేపీ గెలవగా.. కాంగ్రెస్ 37 స్థానాల్లో గెలుపొందింది. ఒక్కో నియోజకవర్గంలో ఫలితం ఒక్కో విధంగా ఉంటూ వచ్చింది. మొదటి రౌండ్‌లో ఫలితం ఒకలా ఉండగా.. రౌండ్ రౌండ్‌కు మారుతూ వచ్చింది. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించాల్సి ఉంటుంది. అలాకాకుండా తమకు ప్రతికూలంగా ఫలితం వస్తే ఈవీఎంలను తప్పుపట్టడం, అనుకూలంగా ఫలితం వస్తే ప్రజాస్వామ్యం గెలిచిందంటూ ప్రకటనలు చేయడం ఓటర్లను అవమానించడమే అవుతుందన్న చర్చ జరుగుతోంది. జమ్మూ కశ్మీర్‌లో ఫలితాన్ని స్వాగతించిన కాంగ్రెస్.. హర్యానాలో మాత్రం ఏదో జరిగిందంటూ ప్రచారం చేయడం, దానిపై జగన్ స్పందించడం చూస్తుంటే ప్రజల తీర్పును వైసీపీ జీర్ణించుకోలేకపోతుందనే విషయం స్పష్టమవుతోందని కూటమి పార్టీలు విమర్శిస్తున్నాయి.

# సరస్వతీ అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ

**- అమ్మవారి దర్శనం కోసం భారీగా భక్తులు రాక**

**- కూతురు ఆద్యతో అమ్మవారిని దర్శించుకున్న పవన్ - అమ్మవారి సేవలో మంత్రి అనిత తదితరులు**

**తొలి సమయం విజయవాడ,అక్టోబర్9:**ఇంద్రకీలాద్రి పై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా ఏడవరోజు బుధవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం కావడంతో ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. దీంతో అధికారులు అన్ని టిక్కెట్లు రద్దు చేసి, అన్ని క్యూలైన్లలో ఉచితంగా భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. అర్ధరాత్రి నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అలాగే దేశ వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూలా నక్షత్రం కావడంతో దుర్గమ్మ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ క్రమంలో దుర్గమ్మను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దర్శించుకున్నారు. కుమార్తె ఆద్యతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న పవన్‌కు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్ర పటం అందజేశారు. పవన్‌తోపాటు హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రి నిమ్మల రామానాయుడు దుర్గమ్మను దర్శించుకున్నారు. ఇక ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తాన్నారు. దీంతో ఆ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది.అలాగే అమ్మవారిని దర్శించుకునేందుకు హోం మంత్రి వంగలపూడి అనిత వచ్చారు. కాగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను చూడగానే భక్తులలో ఒక్కసారిగా ఉత్సాహం వచ్చింది. జై జనసేన జై పవన్ కళ్యాణ్ అంటూ నినాదాలు చేశారు. వినాయకుని గుడి వద్ద క్యూలైన్లు దాటి భక్తులు బారులు తీరారు. బాక్సుల విధానంలో రోప్‌ల సాయంతో యాభై మంది చొప్పున భక్తులను క్యూలైన్‌లోకి పోలీసులు పంపుతున్నారు. తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టి లో ఉంచుకుని సీపీ రాజశేఖర్ బాబు ముందస్తుగా అవసరమైన అన్నీ చర్యలు చేపట్టారు. కొండపైకి ఈరోజు ఎటువంటి వాహనాలను అనుమతించమని పోలీసులు వెల్లడించారు. కాగా బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరి మూడు గంటలకు ఇంద్రకీలాద్రికి చేరుకోనున్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాక సందర్భంగా నగరంలో కొన్ని ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నామని సీపీ తెలిపారు. డైనమిక్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు సమయాను కూలంగా ఈ ఆంక్షలు ఉండే అవకాశం ఉందన్నారు. కనకదుర్గా ఫ్లై ఓల్గ÷వర్ మీద ఎటువంటి ఆంక్షలు లేవని, కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ÷÷-ల ఓవర్‌పై రాకపోకలు పూర్తిగా నిషేధించామన్నారు. ఇప్పటికే విధులలో 4,500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తుండగా, అదనంగా మరో 1100 మంది పోలీసులను 110 బృందాలుగా ఏర్పాటు చేసి హోల్డింగ్ టీమ్‌లుగా విధులు కేటాయించినట్టు తెలిపారు. కాగా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆరో రోజు మంగళవారం కనకదుర్గమ్మ అదృష్టం, విలాసం, ఐశ్వర్యం, సంపద, శ్రేయస్సులకు ప్రదాత అయిన లక్ష్మీదేవిగా దర్శనమివ్వగా అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకూ క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. ఒంటినిండా బంగారం, పుష్పాలంకరణలో ఐశ్వర్య ప్రదాయిని రూపాన్ని తిలకించి తరించారు. సాయంత్రం అమ్మవారి నగరోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ పెరిగింది. వివిధ రాష్ట్రాలనుంచి తరలివచ్చిన భక్తులతో తెల్లవారుజాము నుంచి అన్ని క్యూలు నిండిపోయాయి. కనకదుర్గమ్మ మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, శివస్వామి దర్శించుకున్నారు. అన్నవరం దేవస్థానం అధికారులు, అర్చకులు అమ్మవారికి పట్టువస్త్రాలను, పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకాతిరుమల నుంచి పట్టుచీర సమర్పించారు. ఇంద్రకీలాద్రిపై మంగళవారం సాధారణంగానే కనిపించింది. మామూలు రోజుల్లో ఆదివారం, మంగళవారం, శుక్రవారం భక్తులు అధికంగా వస్తుంటారు. ఈ రోజుల్లో 50 వేల నుంచి 60 వేల వరకు భక్తుల సంఖ్య ఉంటుంది. ఆ స్థాయిలోనే భక్తులు వచ్చారని ఆలయ అధికారులు అంచనా వేశారు. విజయవాడకు చెందిన ఓ మహిళ రూ.500 క్యూలో వచ్చి రాజగోపురం వద్ద సొమ్మసిల్లి పడిపోయింది. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారి సందడి ఎక్కువగా కనిపించింది. మధ్యాహ్నం నుంచి కాణిపాకం దేవస్థానం అధికారులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

## హర్యానా ఫలితాలను విశ్లేషిస్తున్నాం

**జమ్మూకశ్మీర్ ప్రజలకు కృతజ్ఞతలు**

**ఎక్స్‌లో పోస్ట్ చేసిన కాంగ్రెస్ నేత రాహుల్**

**న్యూఢిల్లీ,అక్టోబర్9:** ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ హరియాణా లో కాంగ్రెస్ ఓటమి పాలైంది. ఈ క్రమంలో ఫలితాలపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ హరియాణాలో పరాజయంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. ఈ అనూహ్య ఫలితాలను తాము విశ్లేషిస్తున్నామని తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. జమ్మూకశ్మీర్ ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గెలుపు మన రాజ్యాంగం సాధించిన విజయం. ప్రజాస్వామ్య ఆత్మగౌరవానికి దక్కిన విజయం. ఇక హరియాణాలో అనూహ్య ఫలితాలపై మేం విశ్లేషణ చేపట్టాం. చాలా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం. హరియాణాలో పార్టీ కోసం నిరంతరం పనిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. ప్రజల హక్కులు, సామాజిక, ఆర్థికన్యాయం, నిజం కోసం మా పోరాటం కొనసాగుతుంది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101